చంద్రబాబుకు ప్రజా వ్యతిరేకత తప్పదు

కర్నూలు(టౌన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1992 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ఒకేసారి 10 ప్రయివేట్ వైద్య కళాశాలలను తీసుకొచ్చిన సమయంలో ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక రాజీనామా చేశారని, అవే పరిస్థితులను సీఎం చంద్రబాబు ఎదుర్కొనక తప్పదని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం కర్నూలులోని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న మంచి ఉద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు. నిర్వహణ చేతకాని చంద్రబాబు నాయుడు ఆ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిన తమ అనుయాయులకు కట్టబెట్టేందుకు ప్రైవేటీకరణ చేస్తున్నాడన్నారు. ప్రయివేటు వైద్య కళాశాలల నిర్వహణలో వైద్య సీట్లు రూ.లక్షలకు అమ్ముకునేందుకు చంద్రబాబు నాయుడు కుట్ర చేస్తున్నాడన్నారు.

● వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలను ఈ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందన్నారు. ఏడాదిన్నరలోపే ఈ ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. కనీసం రైతులకు యూరియా అందించలేని స్థితిలో ఉందన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. విద్యుత్ చార్జీలు పెంచడంతో సామాన్యులు, పేద వర్గాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టేందుకు పీపీపీ విధానాన్ని తీసుకొచ్చాడన్నారు. 42 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేసినప్పుడు ఆ డబ్బులు ప్రభుత్వానికే వస్తాయన్న ఇంగిత జ్ఞానం బాబుకు లేదన్నారు.

● నందికొట్కూర్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దారా సుధీర్ మాట్లాడుతూ 1995 నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు పేదల గురించి ఏనాడు మాట్లాడలేదన్నారు. సమావేశంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కాటసాని ఓబుల్ రెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వర్ రెడ్డి, పార్టీనేతలు గుండం సూర్యప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్ తదితరులు

బైరెడ్డి సిద్దార్థ రెడ్డి హౌస్ అరెస్టు..

'చలో నంద్యాల మెడికల్ కాలేజీ' కార్యక్రమంలో పాల్గొనాల్సిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు బైరెడ్డి సిద్దార్థ రెడ్డిని కర్నూలు మూడవ పట్టణ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. తెల్లవారు జామున 4 గంటలకే పోలీసులు ఇంటి వద్దకు చేరుకొని మోహరించారు. విషయం తెలుసుకున్న యువజన విభాగం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. శాంతి యుతంగా చేపడుతున్న కార్యక్రమానికి సైతం పోలీసులు అనుమతి ఇవ్వలేదు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి బైరెడ్డి సిద్దార్థ ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



అథ్లెట్ ఎస్.హాజీబాషాకు ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం గోరంట్ల గురుకుల పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ భూషన్న శుక్రవారం తెలిపారు. కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అండర్-16 హైజంప్ విభాగంలో గోరంట్ల గురుకుల పాఠశాల విద్యార్థి ఎస్.హాజీబాషా ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలియజేశారు. అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థి హాజీబాషాను, శిక్షణ ఇచ్చిన పీఈటీలు రాజు, చంద్రికకు ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ఈ-కేవైసీపై అవగాహన కల్పించండి



పోలకల్‌లో ఈ-కేవైసీ నమోదుపై సూచనలు చేస్తున్న ఏపీఓ రామన్న

సి.బెళగల్: మండలంలో ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు ఈ-కేవైసీ నమోదుపై అవగాహన కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి మండల ఏపీఓ రామన్న సూచించారు. ఆయన శుక్రవారం ఆయా గ్రామాల్లో టీఏలు, ఎఫ్ఏలు చేపట్టిన కూలీల ఈ-కేవైసీ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలకల్ గ్రామంలోని సచివాలయం - 2 గ్రామ ఎఫ్ఏలు, మేటీలతో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి సిబ్బంది చేపట్టిన ఈ -కేవైసీ నమోదు అవసరం, ఉపయోగంపై అవగాహన కల్పించి, కూలీలందరి వివరాలతో ఈ-కేవైసీలో నమోదు చేయాలన్నారు. ఏపీఓ వెంట టీఏ ఉమామహేశ్వరి, ఎఫ్ఏలు, మేటీలు ఉన్నారు. కాగా గ్రామాల్లో శుక్రవారం టీఏలు, ఎఫ్ఏలు కూలీల ఈ-కేవైసీని నమోదు చేశారు.

బొప్పాయి లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

పాణ్యం: బొప్పాయి పండ్ల లోడ్డుతో నంద్యాల నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన పాణ్యం మండల పరిధిలోని నూలు మిల్లు జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. హైవే పెట్రోల్ సిబ్బంది వివరాల మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ నంద్యాల నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ బల్విందర్‌కు గాయాలు కావడంతో నంద్యాల ఆస్పత్రికి తరలించారు. హైవే పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

పాణ్యం ఎస్‌బీఐలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న బ్యాంక్ సిబ్బంది, పోలీసులు

పాణ్యం: దేశంలోని పలు ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్న బ్యాంకు దొంగతనాల నేపథ్యంలో పాణ్యం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. బ్యాంకులోకి దొంగలు చొరబడితే సిబ్బంది, ఖాతాదారులు ఎలా స్పందించాలి, ఎలా తప్పించుకోవాలి అనే అంశాలపై సిబ్బందికి ప్రాక్టికల్‌గా చూపించారు. కార్యక్రమంలో పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఎస్‌బీఐ సెక్యూరిటీ ఆఫీసర్ సుభాష్ శర్మ, ఫైర్ ఆఫీసర్ చాకో, మేనేజర్ అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌కో వాహనాల అడ్డగింత



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

పాణ్యం: పిన్నాపురం గ్రామంలో గ్రీన్‌కో పరిశ్రమ కోసం జంతువుల మేత భూములను ఆక్రమిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గ్రీన్‌కో వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. గ్రామస్తుల తాగునీటి అవసరాలు, జంతువుల మేత కోసం భూములను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే చేసి భూములను యథావిధిగా ఉంచాలని కోరారు. పోలీసులు గ్రామానికి చేరుకుని రైతులకు సర్దిచెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు ప్రసాద్, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నివారించండి

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(రూరల్): మండలంలో వీధి కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 18న 'బాబోయ్ కుక్కలు' శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ జి.వి.చంద్రశేఖర్ స్పందించారు. మండలంలోని గార్గేయపురం, శివరామాపురం, ఆర్.కొంతలపాడు, ఇ.తాండ్రపాడు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. గ్రామాల్లో వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని, కుక్కలను గ్రామాలకు దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

వర్మీకంపోస్టు ఉత్పత్తి చేయాలి

కల్లూరు: గ్రామాల్లో ఉన్న చెత్త సంపద (ఎస్ డబ్ల్యూపీ సీ) కేంద్రాల నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయా రు చేయాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి సూచించారు. శుక్రవారం పెద్దటేకూరు గ్రామ సచి వాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ద్వారా డ్రమ్ములు, గచ్చులు, నీటి తొట్లలో ఉన్న నీరు తొలగించాలని సూచించారు. దీంతో దోమలు, లార్వాలు అభివృద్ధి తగ్గు తుందన్నారు. స్వచ్ఛతహీసేవ, ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



వర్కూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న స్పెషలాఫీసర్ వెంకటరాముడు

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సివిల్ సప్లై జిల్లా మేనేజర్, మండల స్పెషలాఫీసర్ వెంకటరాముడు సూచించారు. శుక్రవారం మండలంలోని వర్కూరు హైస్కూల్‌ను స్పెషలాఫీసర్ వెంకటరాముడు, కోడుమూరు ఎంపీడీఓ రాముడు సందర్శించి విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్పెషలాఫీసర్ స్వయంగా ఆహారాన్ని పరిశీలించడంతో పాటు, మధ్యాహ్న భోజనం కోసం సరఫరా అవుతున్న బియ్యం, కోడిగుడ్లను పరిశీలించారు. కొన్ని గుడ్లు సైజు చిన్నగా ఉండడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ చిన్నసైజు గుడ్లను కాంట్రాక్టర్ వద్ద నుంచి తీసుకోరాదని సిబ్బందికి సూచించారు. అనంతరం వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా కోడుమూరు ప్రభుత్వాసుపత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీసి డాక్టర్లకు పలు సూచనలిచ్చారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు



కోడుమూరులో ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన

కోడుమూరు రూరల్: పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాల్సిన ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహించలేమంటూ ప్రైవేటుపరం చేయాలని చూస్తుండటం దారుణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి విమర్శించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కోడుమూరులోని కోట్ల సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని హామీలిచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రస్తుతం వాటిని అమలు చేయకుండా విద్యార్థులను దారుణంగా మోసం చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, వెంటనే వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని, డిగ్రీ ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు వీరేంద్ర, అల్తాఫ్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులపై పోలీసుల దాడి హేయం

ఆదోని మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అని ఎస్ఎఫ్ఐ గూడూరు మండల నాయకులు ఖాజావలి, శేఖర్ ఖండించారు. విద్యార్థులపై పోలీసుల దాడికి నిరసనగా గూడూరులో ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఖాజావలి, శేఖర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని చూస్తుండడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇకనైనా వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలని వారు డిమాండ్ చేశారు.



గూడూరులో ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: స్వస్థ నారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న వైద్య సేవలను మహిళలు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్‌బాబు సూచించారు. శుక్రవారం మండలంలోని వర్కూరు గ్రామంలో స్వస్థ నారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగప్రసాద్ బాబు మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు ఉచితంగా అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు పాముకాటు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్‌మాదన్న, వైద్య సిబ్బంది రామక్రిష్ణయ్య, రాఘవయ్య, కమాల్ సాహెబ్, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కబడ్డీ ప్రాక్టీస్ షురూ



కబడ్డీ క్రీడాకారులతో జెడ్పీటీసీ, తదితరులు

గడివేముల: సెప్టెంబర్ 24న విజయవాడలో జరగనున్న సబ్ జూనియర్ కబడ్డీ పోటీల నేపథ్యంలో గడివేముల జెడ్పీ స్కూల్ గ్రౌండ్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు ప్రాక్టీస్ చేస్తున్నారు. శుక్రవారం జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. విద్యార్థులు వ్యాయామంపై దృష్టి పెట్టాలని నాయకులు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంతల మధుసూదన్ క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్ ఆడించారు. బాగా ఆడి మండలానికి మంచి పేరు తీసుకునిరావాలని ఆకాంక్షించారు.

సైట్ ఇంజినీర్ అదృశ్యం



విజయ్‌కుమార్ (ఫైల్)

కోడుమూరు రూరల్: నెల్లూరు జిల్లాలోని గండ్లవీడు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ (27) గూడూరు మండలంలోని సుంకేసుల డ్యాం వద్ద కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్టులో సైట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. అయితే విజయకుమార్ ఈనెల 17వ తేదీ నుంచి కనిపించడం లేదని, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని అతని మేనమామ నాగేశ్వరరావు శుక్రవారం గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గూడూరు ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. విజయ్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు గూడూరు పోలీసులకు (సెల్ - 91211 01072) సమాచారం తెలుపాలంటూ అతని ఫొటో విడుదల చేశారు.

ఒంగోలు జేసీ వాఖ్యలపై పీఎస్‌ల మండిపాటు



సి.బెళగల్‌లో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

సి.బెళగల్: ఒంగోలు జిల్లా జాయింట్ కలెక్టర్ వాఖ్యలపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు (పీఎస్‌లు), సచివాలయ ఉద్యోగులు మండిపడ్డారు. ఈ మేరకు వారు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. గురువారం ఒంగోలు జిల్లా అధికారుల సమావేశంలో ఆ జిల్లా జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెవెన్యూ శాఖ మాత్రమే పనిచేస్తోందని, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు పనిచేయడం లేదని, వారికి పనులు లేవు, ఏమీ చేతకాదు అంటూ వాఖ్యానించారని తెలిపారు. జేసీ వాఖ్యలను ఖండిస్తూ నిరసన తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో పనిచేసే ఒక అధికారి కేవలం రెవెన్యూ శాఖను మాత్రమే వెనుకేసుకుని రావడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామ స్థాయిలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, పల్లెల్లో అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, పథకాల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. తమ మనోభావాలు, ఆత్మస్థైర్యం దెబ్బతినేలా ప్రకాశం జిల్లా జేసీ వాఖ్యలు ఉన్నాయని, ఆయన వాఖ్యలను వెనుక్కు తీసుకోకపోతే నిరసనలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులుకు అర్జీ ఇచ్చారు.

నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయండి



దేవి శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి తదితరులు

కోడుమూరు రూరల్: కోడుమూరులో హంద్రీ నది ఒడ్డున వెలసిన శ్రీ వల్లెలాంబదేవి ఆలయంలో దసరా సందర్భంగా ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వల్లెలాంబదేవి ఆలయంలో శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికలను ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. వల్లెలాంబదేవి ఆలయంలో 11 రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, దాతల సహకారంతో ప్రతి రోజు భక్తులకు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రమేష్‌నాయుడు, సాలప్ప, హనుమంతు, మాధవస్వామి, సూరి, శ్రీనివాసులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



కాటసానిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: వైఎస్సార్‌సీపీలోని వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం జాయింట్ సెక్రెటరీగా నియమితులైన ఎస్.గోపాల్ రెడ్డి శుక్రవారం కాటసానిని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడిన వారందరికీ పదవులు వరిస్తాయన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. 19వ వార్డు నాయకులు డి.మహేష్ రెడ్డి, తిరుపాల్, నాగరాజు, శ్రీనివాసులు యాదవ్, అయ్యస్వామి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న పీడీ సూర్యనారాయణ

పాణ్యం: ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలను సిబ్బంది చేరుకోవాలని డ్వామా పీడీ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం పాణ్యం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 లేబర్ బడ్జెట్‌లో రూ.2.84 లక్షల లక్ష్యానికి గాను 65 శాతం మాత్రమే చేరుకున్నామని తెలిపారు. పండ్ల తోటల పనుల్లో 110 ఎకరాల లక్ష్యానికి 82 ఎకరాలు మాత్రమే పూర్తయ్యాయని, హౌసింగ్ 90 రోజుల మండేస్‌ను లబ్ధిదారులకు విడతల వారీగా చెల్లించాలని ఆదేశించారు. కంపోస్టు పిట్స్‌లో 2140 లక్ష్యానికి కేవలం 296 అనుమతులు మాత్రమే వచ్చాయని తెలిపారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పనులు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏపీఓ శేషన్న, ఈసీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువుకు టీకా వేస్తున్న పార్థసారథి

కల్లూరు: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నామని.. పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు పార్థసారథి సూచించారు. శుక్రవారం కె.మార్కాపురం పశువైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా వచ్చే నెల 15వ తేదీ వరకు టీకాల కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. టీకాలతో పశువుల్లో వ్యాధిని నిరోధించి పాల ఉత్పత్తి తగ్గకుండా చూడొచ్చని తెలిపారు. దూడల్లో మరణాలను నివారించి ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడుతుందన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని సూచించారు. చిన్నటేకూరు పశువైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా ఇబ్బందులు రాకుండా చర్యలు



మద్దూరు ఆర్ఎస్‌కేలో యురియాను పరిశీలిస్తున్న తహసీల్దార్

పాణ్యం: రైతులకు యూరియా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పాణ్యం మండలంలోని మద్దూరు, గోనవరం సహా పలు గ్రామాల్లో యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్దూరు సహకార సంఘానికి 532 బస్తాల యూరియా అందినట్లు తెలిపారు. ముందుగా నమోదు చేసుకున్న రైతులకు క్రమ సంఖ్య ప్రకారం యూరియాను అందించాలన్నారు. బుకింగ్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ యూరియా బస్తాలు అందేలా చూడాలని సూచించారు. రైతులు ఎక్కడా ఇబ్బందులు ఎదుర్కోకుండా వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘ సిబ్బంది సమన్వయంతో పంపిణీ జరగాలని ఆదేశించారు. ఆయన వెంట వీఆర్ఓ బాలాంజినేయులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్వేశిలో డెంగీ కేసు నమోదు

గడివేముల: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గడివేముల సీహెచ్ఓ మనీ మార్గరేట్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని దుర్వేశి గ్రామానికి చెందిన పల్లపు సునీతకు నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో డెంగీ సోకినట్లు రిపోర్టులు వచ్చాయన్నారు. గ్రామంలోని వీధుల్లో మురుగునీరు నిల్వ ఉన్నచోట మందును పిచికారీ చేయించారు. 50 ఇళ్లలో నివసిస్తున్న వారి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. జ్వరం, దగ్గు, జలుబు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నేడు మెగా వైద్య శిబిరం



మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి

ఓర్వకల్లు: స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళల కోసం నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని జయప్రదం చేయాలని స్థానిక వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి కోరారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లా డారు. మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటేనే కుటుంబం శక్తివంతంగా ఉంటుందని తెలిపారు. శిబిరంలో మహిళలకు చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులతో పాటు రక్తపోటు, మధుమేహం, కంటి, దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. గర్భిణులకు ప్రసూతి పరీక్షలు, రక్తహీనత, రొమ్ము, గర్భాశయం, నోటి కాన్సర్, క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తామని తెలిపారు. అలాగే తల్లీ శిశుసంరక్షణ కార్డులను అందజేస్తామని చెప్పారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొ న్నారు. ఆస్పత్రి వైద్యులు దాదాబాషా, కిశోర్‌కుమార్‌రెడ్డి, స్టాఫ్ నర్సులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన



ఎస్ఆర్ఓకు వినతిపత్రం అందిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన రిజిస్ట్రేషన్ విధానంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాణ్యం డాక్యుమెంట్ రైటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పాణ్యం ఎస్ఆర్ఓ నరేంద్రనాథ్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. రైటర్లు మాట్లాడుతూ.. ఒక రిజిస్ట్రేషన్ సమయంలో అనేక సార్లు ఓటీపీలు నమోదు చేయాల్సి వస్తోందని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఓటీపీ ఇవ్వడం, అందించడం కష్టసాధ్యమవుతోందని పేర్కొన్నారు. ఓటీపీ ఎందుకు చెప్పాలని అడిగితే సరైన సమాధానం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. ఒక రిజిస్ట్రేషన్ పూర్తి కావడానికి సుమారు గంట సమయం పడుతుందని, దీనివల్ల అనేక సాంకేతిక సమస్యలు వస్తున్నాయని వెల్లడించారు. అందువల్ల ప్రభుత్వం ఈ విధానాన్ని పునరాలోచించి, ఓటీపీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజులేఖర్ల సంఘం పిలుపు మేరకు ఈ నిరసన చేపడుతున్నామని, రెండు రోజుల పాటు ఆందోళన కొనసాగుతుందని రైటర్లు తెలిపారు. /కార్యక్రమంలో పాణ్యం డాక్యుమెంట్ రైటర్లు కరణం సునీల్‌కుమార్, సుబ్రమణ్యం, మనోహర్, సుధాకర్, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేద్దాం

● రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



ఉయ్యాలవాడలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఓర్వకల్లు: బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈ నెల 24వ తేదీ చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి నాగన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, లొద్దిపల్లె గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. రైతుల ఆమోదం లేకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా విచ్చలవిడిగా భూములను సేకరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించని సోలార్ ప్రాజెక్టు కోసం రైతుల ఆమోదం లేకుండా రైతులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా భూములను లాక్కుంటే సహించబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.